క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి: చీమకుర్తి ఫీడర్ 33 కేవీ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ డీఈఈ డీ వెంకట కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి సబ్‌స్టేషన్ పరిధిలోని చీమకుర్తి, ఆర్.ఎల్.పురం, పులికొండ పరిసరాలలో పరిశ్రమలకు విద్యుత్ సరఫరాను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు డీఈఈ చెప్పారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన యువకుడికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ఒంగోలు: గిరిజన యువకుడు నవీన్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం భవనంలోని గుర్రం జాషువా ప్రాంగణంలో శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోనే గిరిజనులకు రక్షణ లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లోని గిరిజనుల రక్షణ పరిస్థితి ఏమిటన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు తలపల శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ బాపట్ల జిల్లా సభ్యుడు, న్యాయవాది కట్టా శ్రీనివాసరావు, మాదిగ సంక్షేమ సంఘ నాయకుడు కోట మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి




ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు పూసపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అధికారుల ఇళ్లలో, ఆఫీసుల్లో సొంత పనులకు కార్మికులను వాడుకుంటున్నారని, అందుకు నిరాకరించిన వారికి పనికి వచ్చినా హాజరు వేయకుండా ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను తుంగలో తొక్కి మున్సిపల్ వర్కర్లతో పండుగ రోజులు, జాతీయ సెలవు దినాల్లో పనిచేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అల్లడి కోటేశ్వరరావు, పద్మ, విజయ, పిచ్చియ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్‌లో పంటలు నమోదు చేయించుకోవాలి

మద్దిపాడు: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసే పంటలను రైతు భరోసా కేంద్రంలోని వీఏఏల ద్వారా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రమేష్ సూచించారు. దానివలన ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అంతేగాకుండా ప్రభుత్వ మద్దతు ధరకు పంటలు అమ్ముకోవచ్చని చెప్పారు. కౌలు పొలం సాగు చేసే రైతులు వీఏఏ, వీఆర్వోల ద్వారా కౌలు రైతు కార్డులు పొందాలని తెలిపారు. కౌలు కార్డుల వలన ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పొందడానికి, వైఎస్సార్ రైతు భరోసా పొందడానికి వీలుంటుందని తెలిపారు. కౌలు పొలం సాగు చేసే రైతులు భూ యజమాని పాస్‌బుక్ జెరాక్స్, ఆధార్ జెరాక్స్ తీసుకుని వీఆర్వో, వీఏఏల ద్వారా ఈ కార్డు పొందవచ్చని, కౌలు కార్డు ఆ పంట వరకూ మాత్రమే చెల్లుబాటవుతుందని, కౌలు కార్డుల విషయంలో భూ యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని వివరించారు. ఈ నెల 31వ తేదీలోపు పీఎం కిసాన్ యోజన ద్వారా లబ్ధిపొందడానికి రైతులు వీఏఏల వద్దగానీ మీసేవా కేంద్రాల వద్దగానీ ఈకేవైసీ చేయించుకోవాలని, ఆ విధంగా చేయించుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ పథకం ద్వారా వచ్చే సొమ్ము జమవుతుందని తెలిపారు. అందువలన మండలంలోని ప్రతి రైతు ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు




తీవ్రంగా గాయపడిన శ్రీను

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సోమవారిపేట చీతిరేల కతువపై శుక్రవారం జరిగింది. కంభం మండలం జంగంగుంట్లకు చెందిన శ్రీను బేస్తవారిపేట మండలం సోమవారిపేటలో జరుగుతున్న ఓ వివాహానికి హాజరయ్యాడు. మోటార్ సైకిల్‌పై స్వగ్రామం వెళ్తున్న సమయంలో చీతిరేల కతువ బ్రిడ్జిపై అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్పర్శ్ కార్యక్రమం ప్రాధాన్యతను గుర్తించాలి

- అన్ని సమస్యలకు ఒకచోటే పరిష్కారం పొందాలి
- పాత రిమ్స్‌లో వన్‌స్టాప్ సెంటర్‌కు ఉత్తర్వులు జారీ చేస్తాం
- మాజీ సైనికుల ఆయుధాల లైసెన్స్‌ల సమస్యలకు వారం రోజుల్లో పరిష్కారం
- సైనికులకు జిల్లా యంత్రాంగం అన్నివేళలా సంపూర్ణ సహకారం
- కలెక్టర్, జిల్లా సైనిక సంక్షేమశాఖ చైర్మన్ దినేష్‌కుమార్



మాజీ సైనికుడి భార్యకు పెన్షన్ నగదు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, తదితరులు

ఒంగోలు: మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులకు సంబంధించిన పెన్షన్ల పంపిణీకి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన స్పర్శ్ కార్యక్రమం ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన స్పర్శ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో సమస్య వస్తే ఎవరిని సంప్రదించాలి, ఎక్కడికి వెళ్లాలనేది తెలిసేది కాదన్నారు. కానీ, నేడు ప్రధానమంత్రి ఒక ప్రత్యేకమైన ఆలోచన ద్వారా అన్ని సమస్యలకు ఒక చోట నుంచే పరిష్కారం కల్పించేందుకు చొరవ చూపడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా 23 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు చేపడితే అందులో ప్రకాశం జిల్లా ఒకటిగా ఉండటం మనకు గర్వకారణమన్నారు. సైనిక శాఖ అధికారులు కోరుతున్నట్లుగా ఒంగోలులో పర్మినెంట్ వన్‌స్టాప్ సొల్యూషన్ సెంటర్‌కు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయానికి స్థలం ఇప్పటికే దాదాపుగా ఖరారైందని కలెక్టర్ వెల్లడించారు. అందులో పర్మినెంట్ కార్యాలయం ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. అప్పటివరకు పాత రిమ్స్‌లోని ఒక గదిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేస్తామని ప్రకటించారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూమి ఆక్రమణకు గురైతే స్పందన కార్యక్రమం ద్వారా పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ఆ మేరకు తహసీల్దార్లకు ఉత్తర్వులు కూడా జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. మాజీ సైనికుల ఆయుధాల లైసెన్స్‌లకు సంబంధించి తన కార్యాలయంలో 2020 నుంచి పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించడం జరిగిందని, వాటన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరిస్తామని అన్నారు. మాజీ సైనికులు ఏదైనా వ్యాపారం చేసుకోవాలనుకుంటే వారికి అవసరమైన సహకారాన్ని, సాంకేతిక శిక్షణను సైతం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

స్పర్శ్‌లోకి 22 లక్షల మంది పెన్షనర్లు...

చెన్నై నుంచి వచ్చిన డిఫెన్స్ అకౌంట్స్ జయశీలన్ మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 32 లక్షల మంది పెన్షనర్లు ఉన్నారని, వారిలో 22 లక్షల మంది స్పర్శ్‌లోకి వచ్చారని తెలిపారు. మిగిలిన వారు బ్యాంకు ద్వారా పెన్షన్ పొందుతున్నారని, వారు స్పర్శ్‌లోకి రావాలని కోరుకుంటున్నామని, రావడం అనేది వారి ఇష్టమని అన్నారు. స్పర్శ్‌లో జాయిన వడం ద్వారా ఎలాంటి మేలు జరుగుతుందనేది గణాంకాలు, ఉదాహరణలతో వివరించారు. రాజ్ సైనిక్ బోర్డు డైరెక్టర్, విశిష్ట సేవా మెడల్ గ్రహీత బ్రిగేడియర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్‌కు జిల్లాలో మాజీ సైనికులు, సైనికులు ఎదుర్కొంటున్న 102 సమస్యలను తెలియజేయడం జరిగిందని, వాటిపై సత్వరమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించడం ఆనందంగా ఉందని అన్నారు. అదే విధంగా సైనిక సంక్షేమశాఖ కార్యాలయానికి స్థలం కేటాయిస్తుండటం సంతోషకరమని, త్వరలో నిధులు కూడా తెప్పించుకుని నిర్మాణాన్ని ప్రారంభించుకుందామని అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టిన కలెక్టర్, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి, మాజీ సైనిక సంక్షేమ సంఘ సభ్యులకు అభినందనలు ప్రకటించారు. రెండురోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సునీత ప్రసాద్ అనే మహిళకు రూ.23,88,534 పెన్షన్ అందించారు. ఆమె భర్త మిలటరీ నుంచి రిటైరై సిర్పూర్ కాగజ్ నగర్ పేపర్ మిల్లులో పనిచేస్తూ మరణించారని, ఆమెకు పెన్షన్ వస్తుందనే విషయం తెలియదని వెంకటరెడ్డి తెలిపారు. 2013 నుంచి ఆమెకు పెన్షన్ వస్తుందని, 2021లో వారికి తెలిసిన సైనికుని ద్వారా విషయం తెలుసుకుని స్పందించడంతో ఆమెకు రావాల్సిన మొత్తాన్ని కలెక్టర్ చేతులమీదుగా అందించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారిణి రజనీకుమారి, మాజీ సైనికుల సంక్షేమ సంఘ నాయకులు నెప్పలి నాగేశ్వరరావు, చుండూరి శ్రీరామమూర్తి, పాశం వెంకటరెడ్డి తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

బూత్ లెవల్ ఏజెంట్ల నియామకాన్ని చేపట్టాలి



సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

- గడప గడపకు పూర్తయిన మండల కేంద్రాల్లో విజయోత్సవాలు నిర్వహించాలి
- సంతనూతలపాడు నియోజకవర్గ అభివృద్ధికి రూ.19 కోట్లు మంజూరు చేసిన సీఎం
- ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలోని బూత్ లెవల్ ఏజెంట్ల నియామకాన్ని వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి చీమకుర్తిలోని సూర్యగ్రానైట్ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే టీజేఆర్, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి మాట్లాడుతూ ఎన్నికలు రానున్న నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసేందుకు బూత్ లెవల్ ఏజెంట్ల నియామకాన్ని పూర్తి చేయాలని సూచించారు. దాంతో పాటు పార్టీ సంస్థాగత కమిటీల నియామకాన్ని కూడా పూర్తి చేయాలని చర్చించారు. పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కోసం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన మండలాల్లో విజయోత్సవాలు నిర్వహించాలని, మన ఊరు–మన ఎమ్మెల్యే కార్యక్రమాలను నిర్వహించేందుకు పార్టీల నాయకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సంతనూతలపాడు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొత్తం రూ.19 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే టీజేఆర్ ఈ సందర్భంగా తెలిపారు. వాటిలో రూ.10 కోట్లు రోడ్ల నిర్మాణానికి, రూ.3 కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా, మరో రూ.6 కోట్లు గ్రానైట్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ డీఎంఎఫ్ ద్వారా అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎంకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే టీజేఆర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, నాలుగు మండలాల పార్టీ కన్వీనర్లు పోలవరపు శ్రీమన్నారాయణ, మండవ అప్పారావు, దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీకి ఐదు నామినేషన్లు



నామినేషన్ల అనంతరం మేయర్ గంగాడ సుజాత, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లుతో కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సబర్బన్: నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఐదుగురు నామినేషన్లు వేశారు. జీఓ ఎంఎస్ నంబర్-49 ప్రకారం 2023–24 సంవత్సరానికి సంబంధించి స్టాండింగ్ కమిటీని ఎన్నుకోవడానికి ఈ నెల 15వ తేదీ ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు నోటిఫికేషన్ విడుదల చేశారు. అందుకుగానూ నామినేషన్లు స్వీకరించడానికి ఈ నెల 21వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు గడువు విధించారు. ఐదుగురు కార్పొరేటర్లు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేయగా, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కేవీ వెంకటేశ్వర్లు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్లు వేసిన వారిలో 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఫాతిమాబి, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య, 42వ డివిజన్ కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, 43వ డివిజన్ కార్పొరేటర్ కండె స్వాతి, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి ఉన్నారు. నామినేషన్ల కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి చదువుకు ఆర్థికసాయం



యాదమ్మకు ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద విద్యార్థిని చదువుకు సూర్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఆర్థికసాయం అందజేశారు. ఇంటర్మీడియెట్‌లో 80 శాతానికిపైగా మార్కులు సాధించి పేదరికం కారణంగా నర్సింగ్ చదివేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థిని యాదమ్మకు స్థానిక ట్రస్టు కార్యాలయంలో రూ.24,500 ఆర్థికసాయం అందజేశారు. యాదమ్మకు తండ్రి లేకపోవడంతో తల్లి కూలి పనులు చేస్తూ ఇల్లు గడుపుతోంది. ఈ విషయం తెలుసుకున్న ట్రస్టు చైర్మన్ సయ్యద్ షహనాజ్, సర్దార్‌బాషా ప్రవాస భారతీయుడు సుమంత్ మద్దులూరి సహకారంతో యాదమ్మకు ఆర్థిక సహాయం తాలూకు చెక్కు అందజేశారు. గతంలో కూడా ఒకసారి కాలేజీ మెస్, కాలేజీ ఫీజు నిమిత్తం రూ.42 వేలు అందించినట్లు తెలిపారు.

శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న శిద్దా దంపతులు



శిద్దా దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈవో లవన్న

ఒంగోలు: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు శుక్రవారం శ్రీశైలంలోని భ్రమరాంబికాదేవి సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థాన కార్యనిర్వాహక అధికారి లవన్న ఆలయ సంప్రదాయాల ప్రకారం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శిద్దా రాఘవరావు దంపతులకు స్వాగతం పలికారు. ఆలయంలో అభిషేక సేవ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించిన అనంతరం శిద్దా దంపతులకు ఆలయ కార్యనిర్వాహక అధికారి లవన్న, ఏఈవో మోహన్, హరిదాసు, అర్చకులు వేదమండపంలో వేద ఆశీర్వచనాలు అందించారు. స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

సుస్థిర అభివృద్ధిని కాంక్షిస్తూ యాత్ర

- మాజీ ఐఏఎస్ విజయ్‌కుమార్



విజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దళిత నాయకులు

ఒంగోలు: సుస్థిర అభివృద్ధిని కాంక్షిస్తూ తుని నుంచి తడ వరకు యాత్ర నిర్వహిస్తున్నట్లు మాజీ ఐఏఎస్ జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఒంగోలు చేరుకున్న ఆయన.. స్థానిక ఒక హోటల్‌లో దళిత, బడుగు బలహీనవర్గాల నేతలతో సమావేశమయ్యారు. తాను ఎందుకు యాత్ర చేపడుతున్నానన్న విషయంపై వారికి క్లారిటీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్‌గా జిల్లాలోని దళిత ప్రజల సంక్షేమానికి, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ఆయన అందించిన సేవలను దళిత నాయకులు కొనియాడారు. విజయ్‌కుమార్‌ను కలిసిన వారిలో మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకుడు సృజన్ మాదిగ, తదితరులు ఉన్నారు.

బస్సు ఏర్పాటుపై బూచేపల్లికి కృతజ్ఞతలు



బూచేపల్లి శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడం పట్ల దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డికి తల్లిదండ్రులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న మారుమూల గ్రామాల విద్యార్థులకు బస్సు లేకపోవడంతో లేక నానా అవస్థలు పడుతున్నారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్యను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన వారు ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి అద్దంకి డిపో నుంచి పాఠశాల సమయాల ప్రకారం బస్సును ఆయా గ్రామాలకు నడిపేందుకు అంగీకరించారు. మక్కెనవారిపాలెం, జమ్ములమడక, మారెళ్ల, గంగనపాలెం, నాయుడుపాలెం గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కలిగింది. ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న సురక్ష కార్యక్రమం వరం లాంటిది



లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ చంద్రకళ



31వ డివిజన్‌లో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్, కార్పొరేటర్ నాగజ్యోతి, ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి

ఒంగోలు సబర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఒక వరం లాంటిదని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. నగరంలోని 30వ డివిజన్ గద్దలగుంట-1 సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొని మాట్లాడారు. 1,230 మంది లబ్ధిదారులు వివిధ సర్టిఫికెట్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోగా, కమిషనర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ చంద్రకళ, వైఎస్సార్ సీపీ నాయకుడు నాని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో...

ఒంగోలు నగరపాలక సంస్థలోని 31వ డివిజన్‌లో కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్‌తో పాటు ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేశ్వరరావు, మిడసల మధుబాబు, కొమ్ము రవిచంద్ర, బండారు శ్రీరాములు, బండారు రత్తయ్య, రమేష్ బాబు, మహిళా కన్వీనర్ వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు.

జగనన్న సురక్ష చాలా మంచి కార్యక్రమం

నాగులుప్పలపాడు: ప్రజా పాలనలో గతంలో ఎన్నడూ చూడని అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమవుతోందని నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉప్పుగుండూరు-1, 2 సచివాలయాలలో నిర్వహించిన సభలలో ఆమె పాల్గొని మాట్లాడారు. చెప్పిన వాటినే కాకుండా చెప్పనివి కూడా అమలు చేసిన ముఖ్యమంత్రిగా పేరుగాంచిన జగనన్న పాలనలో ప్రతిఒక్కరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజలకు వీలైనంత వరకు మంచి చేయాలనే సంకల్పంతో వారికి అవసరమైన 11 రకాల సేవలను గ్రామ సచివాలయాల ద్వారా ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందన్నారు. భవిష్యత్తులో మనందరం జగనన్నకు తోడుగా ఉందామని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదల రత్నభారతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, లిడ్ క్యాప్, హౌసింగ్, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు కంచర్ల సుధాకర్, కొలకలూరి విజయ్‌కుమార్, పేరాల చెన్నకేశవులు, ఇనగంటి వెంకట రమణారెడ్డి, సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీలు తాటి అనూరాధ, ముస్సంగి వెంకట్రావు, మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్, పెంట్యాల శ్రీనివాసరావు, మద్దిసాని రాజేష్, కందుల డానియేలు, పక్కెల వజ్రంబాబు, నల్లూరి రాజా, తహసీల్దార్ సుజన్ కుమార్, ఎంపీడీవో జయమణి, పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



ఉప్పుగుండూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ అంజమ్మ

అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలేవి



ధర్నా చేస్తున్న జల్ జీవన్ గ్రామ సమైక్య సంఘ సభ్యులు

ఒంగోలు టౌన్: నాగులుప్పలపాడు మండలంలోని మట్టిగుంట గ్రామానికి చెందిన జలజీవన్ గ్రామ సమైక్య సభ్యుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని ప్రజాతంత్ర మహిళా సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రగతి భవన్ ఎదుట డ్వాక్రా మహిళలు ధర్నా నిర్వహించారు. గ్రామ సమైక్య సభ్యులకు తెలియకుండా జనరల్ బాడీ ఎంపిక చేయడమేమిటని ఆమె ప్రశ్నించారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న సంఘాన్ని నిర్వీర్యం చేయడానికి మండల సీసీ కవిత, ఏఈఎం రవికుమార్ చేస్తున్న ప్రయత్నాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ నెల 12వ తేదీ గ్రామసభ జరుపుతామని దండోరా వేయించిన అధికారులు.. మాయమాటలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆగస్టు 10వ తేదీలోపు తప్పనిసరిగా గ్రామసభ జరుపుతామని పీడీ ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సమైక్య సంఘ సభ్యులు లక్ష్మి, తమ్మటూరి వెంకాయమ్మ, ఉసిరిపాటి అరుణ, వి.నిర్మల, మాచవరపు ప్రేమకుమారి, ప్రసన్న, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో గృహాలు పూర్తి చేయాలి



ఈతముక్కలలో జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఈతముక్కల (కొత్తపట్నం): జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, డిజేబిలిటీ ఏడీ జి.అర్చన సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా ఈతముక్కలలో జగనన్న లే అవుట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ పేదలందరికీ సొంతిల్లు ఉండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలలో భాగంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మిస్తున్నారని వివరించారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు ఇంటి స్థల పట్టాను తనకా పెట్టుకుని బ్యాంక్‌లో లోను తీసుకుని ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఈతముక్కల లే అవుట్లలో 142 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం ఇసుక, స్టీల్, సిమెంట్, కిటికీలు వంటి మెటీరియల్ సిద్ధంగా ఉంచిందన్నారు. జగనన్న లే అవుట్లలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి సౌకర్యాలను ఇప్పటికే కల్పించినట్లు తెలిపారు. ఎంపీడీవో పి.సుజాత మాట్లాడుతూ ఇళ్లు మొదలుపెట్టని లబ్ధిదారుల పట్టాను రద్దు చేసి మరొకరికి ఇస్తామని హెచ్చరించారు. జగనన్న లే అవుట్ కోసం సుమారు రూ.1.30 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంటే సీసీఎల్, శ్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ ద్వారా లోను తీసుకుని ఇళ్లు పూర్తి చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.లక్ష నగదు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, నితిన్, చింపిరయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధు, వలంటీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.